

• తిరుపతికి చెందిన ఓ యువతి గర్భం దాల్చింది. దాన్ని పోగొట్టుకునేందుకు మందుల కోసం తిరుపతిలోని ప్రైవేటు దుకాణాన్ని ఆశ్రయించింది. డాక్టరు చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదని, అలా ఇవ్వాలంటే అదనంగా నగదు చెల్లించాల్సి వస్తుందని దుకాణదారుడు చెప్పాడు. గత్యంతరం లేక ఎమ్మార్పీ కంటే రెండింతల ధర పెట్టి మందులు కొనుగోలు చేసింది. వాటిని ఇష్టానుసారం వాడటం వల్ల తీవ్ర రక్తస్రావమై ప్రాణం మీదకు తెచ్చుకుని ఆస్పత్రి పాలైంది.



• శ్రీకాళహస్తికి చెందిన సురేష్ తన ఐదేళ్ల కుమారుడు దగ్గు, జలుబుతో బాధపడుతుండటంతో పట్టణంలోని ఓ మందుల దుకాణానికి వెళ్లి విషయం చెప్పాడు. దుకాణ యజమాని మందులు ఇచ్చి, మూడు రోజులు వాడమని చెప్పాడు. ఆ మందులు వాడినా ఎలాంటి ఉపయోగమూ లేకపోగా బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించింది. చివరకు డాక్టరు దగ్గరకు వెళ్లారు. బాలుడిని రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచి రూ.10 వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది.

జిల్లాలో ఇటువంటి ఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నా సంబంధిత వైద్యాధికారులు కట్టడి చేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు. జిల్లావ్యాప్తంగా 2,700 లైసెన్సు కలిగిన మందుల దుకాణాలు ఉంటే అందులో తిరుపతిలో 600లకు పైగా ఉన్నాయి. లైసెన్సు లేకుండా 500కు పైగా కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో సగటున రోజుకు రూ.6 నుంచి 8 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అర్హత లేకనే మందుల (ఔషధ) దుకాణాలు పెట్టేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యుల సిఫారసు లేకుండా ఇస్తున్న మందులతో రోగుల ప్రాణాల మీదకు వస్తోంది.

నిబంధనలు గాలికి..!

• పుట్టగొడుగుల్లా అనధికారిక మందుల దుకాణాలు
• డాక్టర్ల చీటీలు లేకుండానే విక్రయాలు
• ప్రజల ప్రాణాలతో చెలగాటం
• మామూళ్ల మత్తులో వైద్యాధికారులు

తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి

నిబంధనలు ఇలా..

• మందుల దుకాణం ప్రారంభించాలంటే ముందుగా ఔషధ నియంత్రణ అధికారుల అనుమతి తీసుకోవాలి.
• దుకాణంలో డీఫార్మసీ పూర్తి చేసిన ఫార్మాసిస్టు తప్పక అందుబాటులో ఉండాలి. అనుమతి వారి పేరుతోనే ఉండాలి.
• మందుల విక్రయాలు పూర్తిగా డాక్టరు చీటి ఉంటేనే విక్రయించాలి. కొనుగోలు చేసిన, విక్రయించిన మందుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి.

అమలు చేసేవారేరి?

• మందుల విక్రయదారులకు తప్పక బిల్లు చెల్లించాలి. కానీ జిల్లాలో ఎక్కడా జరగడం లేదు.
• ఇరకు గదుల్లోనూ దుకాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.
• ఫార్మసీ చదివిన వారు లేకనే మందుల దుకాణాలు కొనసాగుతున్నాయి. అవగాహన లేకనే మందులు ఇచ్చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.
• ఔషధ దుకాణాలకు ఐదేళ్లకొకసారి రెన్యువల్ చేసుకోవాల్సి ఉండగా పాటించడంలేదు.

పత్తాలేని అధికారులు..

జిల్లాలో ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు ఒకరు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు ఉన్నారు. వీరు మందుల దుకాణం ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో కొలతలు, నిబంధనలు పరిశీలించాలి. నెలలో ఒకసారైనా దుకాణాలను తనిఖీ చేయాలి. ఆ దిశగా ఎక్కడా కనిపించడం లేదు. ముడుపులు అందుతుండడం వల్లే అటువైపు చూడడం లేదన్న విమర్శలున్నాయి. దుకాణాలు పక్క ప్రాంతాల్లోకి మార్చుకోవాలన్నా లేదా ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలన్నా అదనంగా ముడుపులు చెల్లించాల్సి వస్తోందని విక్రయదారులు వాపోతున్నారు. ఇదే వ్యవహారంలో ఇటీవల గూడూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు.



కొల్లడంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

శ్రీసిటీ గ్రామాల్లో సర్వే కలకలం

సత్యవేడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండల పరిధిలోని శ్రీసిటీ గ్రామాల్లో రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు చేపడుతున్న భూముల సర్వే కలకలం రేగుతోంది. శ్రీసిటీ పరిధిలోని కొల్లడం, ఇరుగుళం పంచాయతీలలో తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 15 మంది సర్వేయర్లు, వీఆర్వోల బృందం పోలీసు బందోబస్తు మధ్య గ్రామాల్లోని భూముల్లో అణువణువు సర్వే చేపట్టారు. అయితే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తాము సాగు చేసుకుంటున్న భూముల్లో సర్వే ఎందుకు చేస్తున్నారంటూ రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ భూములనే నమ్ముకుని పంటలు పండించుకుని జీవనం గడుపుతున్న తమ భూములను శ్రీసిటీకి కట్టబెట్టేందుకే రెవెన్యూ అధికారులు ఉన్నఫళంగా సర్వేలు చేపడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూములను వదులుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాగా 2008లో శ్రీసిటీ ఏర్పాటు కోసం మొదటి దశలో ఎనిమిది వేల ఎకరాల భూమిని ఏపీఐఐసీ రైతుల ద్వారా సేకరించింది. ఇందులో కొల్లడం, ఇరుగుళం గ్రామాలలో కొంతమంది రైతులు భూములను ఏపీఐఐసీకి ఇవ్వలేదు. ఈ క్రమంలో ఈ గ్రామాల్లో అధికారుల బృందం సర్వే చేయడం చర్చనీయాశంగా మారింది. ఈ విషయమై తహసీల్దార్ సుబ్రమణ్యంను వివరణ కోరగా.. కొల్లడం, ఇరుగుళం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న భూములకు, రికార్డుల్లో ఉన్న భూములకు వ్యత్యాసాలు ఉన్నాయని జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందడంతో జిల్లా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు తాము సర్వేలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల్లో సర్వే సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



అధికారులతో రైతుల వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

ప్రశాంత వాతావరణంతోనే అభివృద్ధి సాధ్యం

• నేటి నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

తిరుపతి(నేరవిభాగం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రశాంత వాతావరణం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం నుంచి 11 రోజులపాటు పోలీసు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ సరిహద్దులు మొదలుకుని.. అంతర్గత భద్రత వరకు పోలీసుల పాత్ర కీలకమన్నారు. అలా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ధైర్య సాహసాలను, త్యాగనిరతిని స్మరించుకోవడానికి సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించి, వారి కుటుంబీకులను సన్మానిస్తామన్నారు. వ్యాసరచన పోటీలు, బృంద చర్చలు.. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. 11 రోజుల పాటు అన్ని సబ్ డివిజన్లు, సర్కిల్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్లలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ఎస్బీ డీఎస్పీ గిరిధర్ పాల్గొన్నారు.

రెండు రోజులు ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 26 నుంచి రెండు రోజుల పాటు ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పోరాట వాహనాలు, బాంబు డిస్పోజల్ ఎక్విప్‌మెంట్లు తదితరాలపై పోలీసు పరేడ్ మైదానంలో ప్రదర్శన ఏర్పాటు చేసి, విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

వైసీపీ నేత ఇంటిపై దాడికి యత్నం!

• అడ్డుకున్న కార్యకర్తలు
• మూడు గంటల పాటు కారులో టీడీపీ నాయకుడి నిర్బంధం
• అర్ధరాత్రి వరకు చిల్లకూరులో ఉద్రిక్తత
• నాటి వైసీపీలో గ్రూపు గొడవలే కారణమా?



కారుకు అడ్డుగా కుర్చున్న వైసీపీ కార్యకర్తలు

పెళ్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చిల్లకూరులోని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్, వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇంటిపై దాడికి యత్నించారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు టీడీపీ నేతలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వీరు గతంలో వైసీపీలో ఉండి.. ప్రస్తుతం టీడీపీలో చేరిన వారు కావడం గమనార్హం. నాడు వైసీపీలోని గ్రూపు విభేదాలే.. ఇప్పుడూ కొనసాగుతూ ఈ సంఘటనకు కారణమైందని సమాచారం. వివరాలిలా ఉన్నాయి. సొంత పనులపై ఆదివారం సత్యనారాయణరెడ్డి బయటకు వెళ్లారు. సాయంత్రం 7 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన గతంలో వైసీపీలో ఉండి ప్రస్తుతం టీడీపీలో చేరిన దువ్వూరు రాకేష్‌రెడ్డి, దయాకర్‌తో పాటు టీడీపీకి చెందిన శిరసనంబేడు గ్రామస్థుడు శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, పునబాకకు చెందిన లోకేష్‌నాయుడు కలిసి సత్యనారాయణరెడ్డి నివాసానికి చేరుకున్నారు. వీరిలో రాకేష్‌రెడ్డి, దయాకర్.. కామిరెడ్డి ఇంటిపై దాడికి యత్నించినట్లు గ్రామస్థులు ఆరోపించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సత్యనారాయణరెడ్డి సతీమణి ప్రభావతమ్మ కేకలు వేయడంలో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. ఆ ఇంటి గేట్లకు తాళాలు వేసి కారులో వెళ్లేందుకు చైతన్యకృష్ణారెడ్డి, రాకేష్‌రెడ్డి, లోకేష్‌నాయుడు ప్రయత్నించగా, గ్రామస్థులతో పాటు వైసీపీ కార్యకర్తలు కారును చుట్టుముట్టారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, అర్బన్ సీఐ బాబీ, ఎస్ఐ శ్రీహరి, ఓజిలి ఎస్ఐ అజయ్‌కుమార్, సిబ్బంది చిల్లకూరు చేరుకున్నారు. కారును చుట్టుముట్టిన గ్రామస్థులను, వైసీపీ కార్యకర్తలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. అయినా, గ్రామస్థులు లేవకపోవడంతో పోలీసులు.. కారులో ఉన్న రాకేష్, లోకేష్‌ను చాకచక్యంగా తప్పించి పోలీస్ వ్యాన్‌లో తీసుకెళ్లారు. దీంతో వైసీపీ కార్యకర్తలు ఆగ్రహించి.. బయట ఊరినుంచి ఇక్కడ గొడవలు పెడుతున్నారని చైతన్యకృష్ణారెడ్డిని తీసుకెళ్లకుండా అడ్డుపడ్డారు. ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లు, ఎడ్లబండ్లను కారుకు అడ్డుపెట్టి మూడు గంటల పాటు చైతన్యకృష్ణారెడ్డిని నిర్బంధించారు. ఎట్టికేలకు పోలీసులు ఆయన్ను రాత్రి 11.30 గంటలకు కారులో తరలించారు. దీంతో గ్రామంలో ఏం జరుగుతుందోనన్న ఉద్రిక్తత నెలకొంది. గతంలో వైసీపీలో గ్రూపు గొడవలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.



నచ్చజెబుతున్న పోలీసులు

విద్యారంగ ఉద్యమాల్లో ఏఐఎస్ఎఫ్‌ది కీలక పాత్ర

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఏఐఎస్ఎఫ్ రాజీలేని పోరాటాలు చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై సంఘం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఉద్యమ దశలో జరిగిన అరెస్టులు, లాఠీచార్జీలు, జైలు శిక్షలను ప్రస్తావించారు. నాయకులు గతాన్ని మరువకుండా సామాజిక సేవలోనూ పాల్గొనాలని కోరారు. నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరిగే 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు జి.ఈశ్వరయ్య, ఎ.రామానాయుడు, బి.లక్ష్మయ్య, ఎన్.ఈశ్వరయ్య, కత్తి నరసింహారెడ్డి, కోట పురుషోత్తం, మంజునాథ్, విశ్వనాథరెడ్డి, రాజారెడ్డి, డాక్టర్ కాటమరాజు, నాగరాణి, డాక్టర్ ఆదిశేష, డాక్టర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఇన్‌చార్జుల పాలనలో రేణిగుంట ఎస్ఆర్వో

• కీలక స్థానంపై అధికారుల నిర్లక్ష్యం
• నిత్యం రూ.కోట్ల విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్

తిరుపతి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చాలాకాలంగా ఇన్‌చార్జుల పాలనే కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇదే కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న శోభారాణిపై నిధుల దుర్వినియోగం, విధుల్లో అలసత్వం కారణంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వేటుపడింది. అప్పట్నుంచి నాలుగు నెలలుగా అక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రవ్యాప్త బదిలీల్లోనూ రేణిగుంటకు సబ్ రిజిస్ట్రార్‌ను నియమించలేదు. ఉద్దేశ పూర్వకంగానే ఈ పోస్టును భర్తీ చేయకుండా వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఇక్కడ పనిచేసి సస్పెండైన ఓ అవినీతి అధికారి రేణిగుంటకు ఎవరినీ రానీయకుండా తెరవెనుక తతంగం నడిపినట్లు ఆరోపణలున్నాయి. ఇందుకు సంబంధించి పెద్దయెత్తున చేతులు మారినట్లు కార్యాలయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పని ఒత్తిడి కారణంగా అవసరమైతే మరో జాయింట్ రిజిస్ట్రార్‌ను కూడా రేణిగుంటకు తీసుకోమని నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉన్నతాధికారులను మభ్యపెట్టి తనకు అనుకూలమైన సీనియర్ అసిస్టెంట్‌ను తాజా బదిలీల్లో రేణిగుంటకు పోస్టింగ్ వేయించడం కూడా అవినీతి అధికారి పథకంలో ఓ భాగమేనన్న అనుమానాలున్నాయి. రోజూ సుమారు రూ.15 కోట్ల విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్ జరిగే కీలక స్థానమైన రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి స్థాయి సబ్ రిజిస్ట్రార్ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. విస్తృత పరిధి కలిగిన ఈ కార్యాలయానికి ఇప్పటికైనా పూర్తిస్థాయిలో ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లను నియమించాల్సిన అవసరముంది.

బాలిక దొరికింది

• 24 గంటల్లో పట్టుకున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి పరారైన 14 సంవత్సరాల బాలిక ఎట్టకేలకు ఆదోని సమీపంలో పట్టుబడింది. ఆమెను ఆదివారం బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. మారుతీనగర్‌లోని ఈమె నాలుగో తరగతి వరకు చదివి.. ఇంటి వద్దే ఉంటోంది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం ఇంటికి వచ్చిన తండ్రి తన కుమార్తె కనిపించకపోవడంతో ఈస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పరారైన బాలిక ఆచూకీ కనుక్కోవడానికి డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో సీఐ శ్రీనివాసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ బాలిక ర్యాపిడో బుక్ చేసుకుని రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు గుర్తించిన సీఐ.. ఏ సమయానికి రైల్వే స్టేషన్‌కు వెళ్లిందనేది తెలుసుకున్నారు. ఆ ప్రకార రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లినట్లు గుర్తించారు. బాలిక ఫొటో ఆధారంగా ఆదోనిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బసవరాజు, తన స్నేహితుడు బైరెడ్డి ద్వారా సీఐ రైలులో గాలింపు చర్యలు చేపట్టారు. ఆ బాలిక హైదరాబాదు వెళుతున్నట్లు తెలుసుకుని అన్ని బోగీలు వెదికారు. ఈ క్రమంలో అమ్మాయి ఆచూకీ గుర్తించి ఆదోనికి శివారులో గుర్తించి బాలికను పట్టుకుని విచారించారు. హైదరాబాదులోని ప్రధాన చర్చిలో ప్రార్థనలు చేయడానికి వెళుతున్నానని చెప్పడంతో బాలికను మెల్లగా కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు తీసుకొచ్చి అక్కడ రైల్వే పోలీసుల సాయంతో గుత్తికి తీసుకొచ్చారు. అనంతరం తిరుపతి నుంచి కానిస్టేబుళ్లను పంపి ఆదివారం సాయంత్రం ఇక్కడికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. పరారైన 24 గంటల్లోనే బాలికను తల్లి దండ్రులకు అప్పగించడం పట్ల ఎస్పీ అభినందించారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం మీకోసం-ప్రజా సమస్యల పరిష్కార వేదికను(పీజీఆర్ఎస్) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. డివిజన్, మండల, సచివాలయ స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు విధిగా హాజరుకావాలని తెలిపారు.

మట్టి పనులతో తాత్కాలిక ఊరట

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్..



రోడ్డు మీద గుంతలపై తాత్కాలికంగా మట్టి పోసి ఉపశమనం

చంద్రగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీనివాసమంగాపురం వెళ్ళే మార్గంలో ఆర్ఎఫ్ రోడ్డులో రెండు నెలల క్రితం సీసీ రోడ్డుపై గుంతలపై అధకారులు మట్టి పోయించి తాత్కాలిక ఊరట కల్పించారు. ఈ రోడ్డు వేసిన సందర్భంలో ఒకపక్క ట్యాంప్ చేయడం మరిచారు. దీంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్..సీసీ రోడ్డు వేసినా ఏం ప్రయోజనం? శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. తాత్కాలికంగా రాళ్లమట్టి పోసి ట్యాంప్ చేశారు. దీంతో ఆదారిలో రాకపోకలు సాగించడానికి కొంత అవకాశం కలిగింది. సీసీ రోడ్డు ట్యాంపర్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాజ్యాంగం పట్ల ప్రజలందరికీ అవగాహన



ఎంఈవో బాబ్జీ

పాకాల, అక్టోబరు (ఆంధ్ర జ్యోతి) 20: రాజ్యాంగం పట్ల ప్రజలు అవగాహనతో హక్కులను కాపాడుకోవాలని ఎంఈవో బాబ్జీ అన్నారు. స్థానిక గ్రంధాలయంలో ఆదివారం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యయన తరగతిలో ఆయన ప్రసంగించారు. ప్రాథమిక హక్కు, వాక్ స్వాతంత్ర్య హక్కు, మతస్వాతంత్ర్య హక్కులను కాపాడుకోవాలన్నారు. రాజ్యాంగంలోని ప్రతిఫలాలు పేద బడుగు బలహీన వర్గాలందరికీ అందాలని ఆకాంక్షించారు. రాజ్యాంగం గురించి వివరించారు. జి.రామయ్య, డాక్టర్ ఆమూరి సుధాకర్, గ్రంధాలయ అధికారి రవీంద్రబాబు, ఉపాధ్యాయులు ప్రభ, జ్యోతి వెంకటరత్నం, ఉదయ్, సరస్వతమ్మ పాల్గొన్నారు.

వర్షానికి ఇంటిలో కూలిన బండల మిద్దె



భాకరాపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఓ మట్టి ఇంటిలో బండలు కూలిపోయాయి. చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగలి రమణ బండల మిద్దెలో నివసిస్తున్నాడు. ఈ ఇంటిని చాలా ఏళ్ల క్రితం మట్టితో నిర్మించారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి నాలుగు బండలు కూలిపోయాయి. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రోడ్డు మార్జిన్ల కోతతో ప్రమాదకరంగా రాకపోకలు



పాకాల-నేంద్రగుంట రోడ్డులో రోడ్డు కిరువైపులా కోసుకుపోయిన మార్జిన్

పాకాల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 20: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో పలు రోడ్లు మార్జిన్‌లు కోసుకుపోయాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ఆసుపత్రిపాలు కావలసిందే. పాకాల నేంద్రగుంట రోడ్డు రైల్వే గేటు సమీపంలోని ఇన్‌ఫెంట్ జీసస్ పాఠశాల ఎదురుగా రోడ్డు కిరువైపులా రోడ్డు మార్జిన్ కోతకు గురైందిది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ మార్గంలో నిత్యం వెళ్తుంటారు. ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో సైడ్ ఇవ్వడానికి రోడ్డు పక్కకు వచ్చి పడిపోతున్నారు. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ రోడ్డుకిరువైపులా మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నేంద్రగుంట - పెనుమూరు మార్గం చెంచులక్ష్మీ కాలనీ సమీపంలోని మలుపువద్ద రోడ్డు మార్జిన్ భారీగా కోసుకుపోయింది. సింగిల్ రోడ్డు కావడంతో నిత్యం పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి రోడ్డు పక్కన కాలువలు ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వర్షమొస్తే రోడ్డుపై మొరాయిస్తున్న నీరు



రాయలచెరువు రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

రామచంద్రాపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి పచ్చికాపల్లం ప్రధాన రహదారి లో అవిలాల నుంచి అగ్రహారం బైపాస్‌రోడ్డు వరకు నిధులు లేక ఓ వైపు పనులు ఆగిపోయాయి. రెండేళ్ల క్రితం బైపాస్ వరకు డబుల్ రోడ్డు పనులను చేపట్టారు. అక్కడ నుంచి తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వరకు దాదాపు కిలోమీటరు దూరం మేర అడుగు మేర ఎత్తు పెంచి సిమెంటు రోడ్డు నిర్మించారు. నిధుల కొరతతో కింద వైపు రోడ్డు వేయలేదు. 300 మీటర్ల దూరం ఒక అడుగు మేర ఎత్తు తగ్గడంతో వర్షపునీరు నిలిచిపోతోంది. రోడ్డుకు రెండు వైపులా కాలువ నిర్మాణం చేపట్టలేదు. దీంతో రోజుల తరబడి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. భారీ వాహనాలు వచ్చినపుడు ద్విచక్ర వాహన చోదకులు, పాదాచారులు తడిసి ముద్దవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంతో పాటు నీరు వెళ్లడానికి కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

చౌడేపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, వేపాకు తోరణలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో క్యూలైన్లు నిండిపోయాయి. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

రేణిగుట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. 2017లో ఓ హత్యాయత్నం కేసులో తారకరామానగర్ పంచాయతీకి చెందిన అక్కుల పార్థసారథి నిందితుడు. కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. తిరుపతి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఆ మేరకు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ముందు హాజరు పరచగా 14రోజులు రిమాండ్ విధించారు.

ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మృతి

వరదయ్యపాళెం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్యా యత్నం చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నెలటూరులో చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జున్ కథనం మేరకు.. మండలంలోని నెలటూరుకు చెందిన గురవయ్య(41)మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 8న భార్యను మద్యానికి డబ్బు ఇవ్వాలని అడిగాడు. అందుకు ఆమె నిరాకరించింది. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో గడ్డి మందు తాగేశాడు. అపస్మారకస్థితిలో ఉండగా గుర్తించి వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.

మినీస్టేడియానికి మహర్దశ

శ్రీకాళహస్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని మినీస్టేడియానికి మహర్దశ తీసుకొస్తామని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. పట్టణంలో స్పోర్ట్స్ అథారిటీస్ ఆధ్వర్యంలో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మినీస్టేడియం ఏర్పాటు చేశారు. వైసీపీ పాలకులు స్టేడియాన్ని పట్టించుకోలేదు. దీంతో అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం శాప్‌చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సంయుక్తంగా మినీస్టేడియాన్ని పరిశీలించారు. భవనం, పరిసరాలు అధ్వానంగా ఉన్నట్లు గుర్తించారు. యుద్ధప్రాతిపదికన అక్కడ పేరుకుపోయిన మద్యం సీసాలు, సిగెరెట్ ముక్కలు, వ్యర్థాలను శుభ్రం చేయించారు. స్టేడియంలోని పరికరాల వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిందన్నారు. చాలాచోట్ల మినీ స్టేడియాలు నిరుపయోగంగా మారాయన్నారు. శ్రీకాళహస్తి మినీస్టేడియాన్ని త్వరలోనే అధునాతనంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పాల్గొన్నారు.

ఆవు మాంసం రవాణా నలుగురిపై కేసు నమోదు

వెదురుకుప్పం, అక్టోబరు 20: 'ఆవును దొంగిలించి, ఆపై దాన్ని వధించి, మాంసాన్ని రవాణా చేశారు. ఈ కేసులో నలుగురిపై కేసు నమోదు చేసి, ఆటో స్వాధీనం చేసుకున్నాం' అని కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు. వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ దిగువ గెరిగిడొన గ్రామానికి చెందిన బి.హరిబాబు కార్వేటినగరం మండలం కార్వేటినగరం రిజర్వు ఫారెస్టులో పశువులను మేతకు వదిలిపెట్టారు. ఆవును వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం కాలనీకి చెందిన పోతిపోగు సూర్య, పట్లూరి తరుణ్, ఎగువ గూళూరుకు చెందిన లవకుమార్, హేమాద్రి కలసి అపహరించి, ఆపై వధించి, మాంసాన్ని ఆటోలో తరలిస్తుండగా.. స్థానికులతో కలిసి బాధితుడు అడ్డుకున్నాడు. నిందితులు నలుగురూ పరారయ్యారు. కేసు నమోదు చేసి ఆటో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు

సప్లయ్ ఛానల్‌కు నీరు చేరే దారేదీ?





ముళ్ల కంపలతో నిండిపోయిన దామలచెరువు - పెద్ద వంకలో సప్లయ్ ఛానల్‌కు నీటి మళ్లింపు నిర్మాణం

పాకాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ కొరవడి ఓ సప్లయ్ ఛానల్ అధ్వానస్థితికి చేరుకుంది. దామలచెరువు పెద్దవంకలో వర్షానికి ప్రవహించే నీటిని చెరువులకు మళ్లించడానికి 40 యేళ్ల క్రితం దామలచెరువు-పాకాల సప్లయ్ ఛానల్ ఏర్పాటు చేశారు. పెద్దవంకలో అడ్డుకట్ట నిర్మించి కాలువ ద్వారా చెరువులకు నీటిని పంపేలా దీనిని నిర్మించారు. దీంతో సుమారు 900 ఎకరాలకు నేరుగా సాగునీరు అందేది. ఈ నీటితో 700లకు పైగా బోరుబావుల్లో నీటి మట్టం పెరిగి వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా ఉండేది. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని వేలాది మంది రైతులకు ఈ ఛానల్ వల్ల లబ్ధి చేకూరేది. పదేళ్ల క్రిందట రూ.40 లక్షల వ్యయంతో కాలువల్లో పూడిక తీయించారు. గట్టును మట్టితో బలోపేతం చేశారు. అవసరమైన చోట సిమెంటు గోడలు, కల్వర్టులు నిర్మించారు. ఫలితంగా వర్షాలకు చెరువులు నిండాయి. ఆ తరువాత పదేళ్లుగా సప్లయ్ ఛానల్ నిర్వహణను అధికారులు పట్టించుకోలేదు. దీంతో పలుచోట్ల కాలువలు పూడుకుపోయాయి. పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోయాయి. అక్కడక్కడ కాలువ గట్లు కూడా తెగిపోయాయి. సిమెంటు గోడలకు పగుళ్లు ఏర్పడి నీరు వృధాగా పోతోంది. కాలువ నుంచి చెరువులకు నీటిని మళ్లించడానికి అమర్చిన గేట్లు తుప్పుపట్టిపోయాయి. ఇప్పుడు పెద్ద వంకలో భారీగా నీరు ప్రవహిస్తున్నా సప్లయ్ ఛానల్‌కు చేరే పరిస్థితి లేదు. అడ్డుకట్ట అధ్వాన్నంగా తయారయింది. పులిచెర్ల మండలం పాకాల మండలం అటవీ పరిసరాలు, పదిపుట్ల బైలు అటవీ ప్రాంతం నుంయి వచ్చే వర్షపునీరుతో ఈ వంకలో భారీగా నీరు ప్రవహిస్తోంది. సప్లయ్ ఛానల్ సరిగా లేక వర్షపు నీరు ఇక్కడకు చేరకుండా జలాశయానికి వెళ్తోంది. మండలంలో ఇరిగేషన్ శాఖ అధికారుల తీరు ను రైతులు విమర్శిస్తున్నారు. చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా, వంకలు, వాగులు కబ్జాలకు గురవుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటున్నారు. చెరువు కట్టలకు మరమ్మతులూ చేపట్టడం లేదు. ఇరిగేషన్ అధికారులు స్పందించి సప్లయ్ ఛానల్‌లతో పాటు చెరువు కట్టలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఈ రహదారిలో ప్రయాణం ఇబ్బందికరమే..

● మలుపుల వద్ద ప్రమాదకరంగా తయారైన చెట్లు,మొక్కలు





మొక్కలు,చెట్ల కొమ్మలతో సగానికి పైగా మూసుకుపోయిన రహదారులు

భాకరాపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు చెరువు మొరవ నుంచి వివిధ గ్రామాలకు అనుసంధానం ఉన్న రొంపిచెర్ల క్రాస్ వరకు రోడ్డుపై ప్రయాణం ఇబ్బందికరంగా తయారైంది. 15 ఏళ్ల క్రితం తారు రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దానిపూ మళ్లీ తారు వేయలేదు. అక్కడక్కడా గుంతలు పడినప్పుడు కొద్దిపాటి మరమ్మతులు చేసి వదిలేశారు. ఈ రోడ్డు చెరువు మొరవ నుంచి రొంపిచెర్ల క్రాసు వరకు ఎనిమిది కిలోమీటర్లు ఉంటుంది. తిరుపతి, మదనపల్లె డివిజన్ల విభజన తర్వాత చిన్న చిన్న మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగిపోయాయి. కొన్ని చోట్ల రోడ్డు మీదకు వచ్చేశాయి. దీనికితోడు అక్కడక్కడా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. చెట్లు పెరిగిపోవడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనపడటం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అప్పుడప్పుడు డోజర్‌తో కొమ్మలను మాత్రమే పక్కకు జరుపుతున్నారు. కానీ కొద్దిరోజులకే పెరిగి మళ్లీ రోడ్డుపైకి వస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ విషయంలో చొరవ తీసుకోవాలని, మళ్లీ తారు వేయాలని కోరుతున్నారు.





స్వర్ణ రథంలో వినాయకస్వామి

స్వర్ణరథంపై వరసిద్ధుడి విహారం

కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతి వ్రతం



సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఆదివారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తులతో వైభవంగా నిర్వహింపజేశారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆస్థాన మండపంలోని వేదికపై కొలువుదీర్చి విశేష పూజలయ్యాక వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు రవి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పల్లెపండుగ

433 గ్రామ పంచాయతీల్లో 722 పనులు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 14వ తేదీన గ్రామ పంచాయతీల్లో ప్రారంభమైన పల్లెపండుగ ఆదివారంతో ముగిసింది. అధికారికంగా ఎమ్మెల్యేలు అందుబాటులో లేని ప్రాంతాల్లో సోమవారం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 700 గ్రామ పంచాయతీలకుగాను 433 చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల 722 పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. 646 సీసీ రోడ్లు, నాలుగు బీటీ రోడ్లు, ఐదు పాఠశాల ప్రహరీలు, ఆరు కొత్త ట్యాంకుల నిర్మాణ పనులకు ప్రారంభోత్సవాలు చేసినట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. కాగా పూర్తి అంచనాలు వేయాల్సి ఉంది.

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై మృతదేహం

వెదురుకుప్పం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న దిమ్మెపై 38 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు.కార్వేటినగరం మండలం డీఎంపురం క్రాస్ గోపిశెట్టిపల్లె గ్రామ సమీపంలో మృతదేహం ఉందని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ ఎంబీ స్విచ్ఛాఫ్ చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. సంఘటన ఐదారు రోజుల కిందట ఘటన జరగడంతో మృతదేహం కుళ్లిపోయి, గుర్తుపట్టలేని విధంగా ఉందని ఎస్ఐ తెలిపారు. ఎత్తు 5.5 అడుగులు కాగా, బ్లూ రంగు గళ్ల లుంగీ, పాచీ కలర్ కట్ బనియన్, ఎరుపు-తెలుపు గీతలు కలిగిన టవల్ ధరించి ఉన్నాడన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశానికి నెలాఖరు వరకు గడువు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు డీఈవో దేవరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో మీసేవ, ఏపీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

ఫోర్జరీ సంతకాల కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు



వెదురుకుప్పం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వన్-బీ అండగల్‌ని ఫోర్జరీ సంతకాలతో తయారీ చేసి, పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్న కేసులో ప్రధాన నిందితుడు పుల్లారెడ్డి(67)ని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం గంటావారిపల్లెకు చెందిన ఎస్.పుల్లారెడ్డి, అతడి కుమారుడు జయచంద్రారెడ్డి అదే గ్రామానికి చెందిన సర్వే నెంబరు-513/6లో 0.66 సెంట్ల భూమిని వన్-బీ అండగల్, తహసీల్దార్ ఫోర్జరీ సంతకాలతో రికార్డులు సృష్టించి.. పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్నారు. దీనిపై తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదుతో వెదురుకుప్పం పోలీసుస్టేషన్ కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి పది గంటల సమయంలో వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె దగ్గర వెదురుకుప్పం-చంద్రగిరి రహదారిలో ప్రధాన నిందితుడైన పుల్లారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి మొబైల్ ఫోన్, ల్యాప్‌ట్యాప్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గతంలో ఏ-2 జయచంద్రారెడ్డిని అరెస్టు చేసి.. రిమాండుకు పంపించామని గుర్తు చేశారు. ఇంకా ఈ కేసులో ఎవరైనా ఉంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

'సూర్య ఘర్'తో విద్యుత్ బిల్లు ఆదా



● సోలార్ ప్యానళ్లకు రూ.78వేల వరకు రాయితీ ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఇంట్లో విద్యుత్ వినియోగం బాగా పెరిగిందా..? బిల్లు భారీగా వస్తోందా..? ఈ భారం నుంచి బయటపడాలంటే ఒకటే మార్గం.. అదే సోలార్ విద్యుత్. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ యోజన కింద రాయితీతో సోలార్ ప్యానళ్లను అందిస్తోంది.

కిలోవాట్‌కు సగటున 4 యూనిట్లు

ఒక కిలోవాట్ సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్ యూనిట్ ఏర్పాటుకు 80 చదరపు అడుగుల స్థలం అవసరం. మూడు కిలోవాట్ల సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటు చేస్తే 240 చదరపు అడుగుల స్థలం అవసరమవుతుంది. ఒక కిలోవాట్ నుంచి రోజుకు సగటున 4 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తవుతుంది. ఒకసారి సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్లపాటు పనిచేస్తాయి. నెట్ మీటరింగ్ అమర్చి.. ఉత్పత్తి అయిన సౌర విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. వినియోగించుకున్న విద్యుత్తులో ఉత్పత్తి అయిన యూనిట్లను మినహాయించుకుని మిగిలిన యూనిట్లకు సొమ్ము వసూలు చేస్తారు.

కాలుష్యం నివారణకు తోడ్పాటు

విద్యుత్ తయారీకి అధిక మొత్తంలో బొగ్గును వినియోగిస్తారు. ఈ కారణంగా వాతావరణం కాలుష్యమవుతుంది. సోలార్ ప్యానల్ కావడం ద్వారా కాలుష్య నివారణతో పాటుగా లైన్‌లాస్ లేని, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును పొందవచ్చు.

3,229 దరఖాస్తులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీఎం సూర్యఘర్ యోజన కింద రెండు నెలల వ్యవధిలోనే 3,229వేల మంది దరఖాస్తు చేశారు. అందులో 206 పనులు పూర్తి చేయగా, వీరిలో 76 మంది ఖాతాలకు రాయితీ సొమ్ము కూడా జమైంది. మరో 76 మందికి నెట్ మీటర్ల అమరిక పూర్తయింది. ఇప్పటి వరకు 749.746 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను బిగించడం జరిగింది.

దరఖాస్తు ఇలా..: ఆసక్తి ఉన్నవారు పీఎం సూర్యఘర్ పోర్టల్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసి.. సొమ్ము చెల్లించిన 30 రోజుల్లో యూనిట్ ఏర్పాటు చేస్తారు. ఒక కిలోవాట్‌కు రూ.30 వేల చొప్పున రాయితీ అందుతుంది. రెండు కిలోవాట్‌కు రూ.60వేలు, మూడు కిలోవాట్‌కు రూ.78వేలను కేంద్రప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. అంతకు మించిన సామర్థ్యంతో ఏర్పాటు చేసుకున్నా.. రాయితీ మాత్రం మూడు కిలోవాట్లకే అందిస్తారు. దరఖాస్తుదారులు తొలుత మొత్తం సొమ్ము చెల్లించాక రాయితీని జమ చేస్తారు. విద్యుత్‌శాఖ క్షేత్రస్థాయిలో సోలార్ ప్యానల్, వైరింగ్, ఎర్తింగ్, నెట్‌మీటరు తనిఖీ చేసి నివేదిక ఇచ్చిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాకు సొమ్ము జమవుతుంది.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

ఒక్కసారి పెట్టుబడి పెడితే చాలు



విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో చార్జీల భారం మోయక తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయం సోలార్ విద్యుత్తు. ఒక్కసారి పెట్టుబడి పెడితే 25 ఏళ్లపాటు సోలార్ ప్యానళ్లు పనిచేస్తాయి. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను వాడుకుని.. మిగిలింది విద్యుత్తు శాఖకే విక్రయించవచ్చు. దీనిద్వారా వచ్చే సొమ్ము కూడా లబ్ధిదారుడి అకౌంట్‌కు జమవుతుంది. పూర్తి వివరాలకు విద్యుత్ శాఖ ఈఈ, ఎస్ఈ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

- ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

హంసధ్వని పుస్తకావిష్కరణ



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో సమగ్ర సమాచారం కోసం హంసధ్వని పుస్తకం ఉపకరిస్తుందని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య దక్షిణమూర్తి శర్మ అన్నారు. అమెరికాలో ఉంటున్న ఐటీ ఉద్యోగి మరువాడ భీమశంకర్ రచించిన హంసధ్వని పుస్తకావిష్కరణ సభ ఆదివారం రామకృష్ణమఠంలో జరిగింది. డీన్ మాట్లాడుతూ ఈ పుస్తకం చదవడం ద్వారా సంగీతానికి సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఎస్వీ యూనివర్సిటీ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం మాజీ అధిపతి ఆచార్య ఎస్.పద్మ మాట్లాడుతూ ప్రముఖ సంగీతజ్ఞాని నూకల చినసత్యనారాయణ బాణీని అనుసరిస్తూ భీమశంకర్ సంగీతంలో మంచి పుస్తకాన్ని ప్రచురించారని తెలిపారు. ఈ పుస్తకాన్ని ఎస్వీ సంగీత కళాశాల గాత్ర విభాగాధిపతి డాక్టర్ ఏ శబరి గిరీష ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజక్టు సంచాలకులు సి.లత, వ్యాపారవేత్త సి.దివాకర రెడ్డి, పరిహార సేవా సమితి అధ్యక్షుడు భరద్వాజ చక్రపాణి, గేయరచయిత జిల్లెల్ల ప్రసాద్, ఎస్.ప్రమీల, కె.సుబ్రమణ్యం, ఎ.నాగలక్ష్మి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డాక్టర్ శబరి గిరీష నిర్వహించిన గాత్ర కచేరి ఆహూతులను అలరించింది. వీరికి ఎల్‌జి రామ్ (వయోలిన్), ఎఎస్ శంకర్ (మృదంగం)వాద్యసహకారం అందించారు.

మెకానిక్‌లకు ఈఎస్ఐ కల్పనకు కృషి



సభ్యులకు టపాకాయలు అందజేస్తున్న ఆవుల మునిరెడ్డి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మెకానిక్‌లకు ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పనకు కృషి చేస్తామని టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. మార్కెట్లోకి ఆధునిక టెక్నాలజీతో వస్తున్న వాహనాల పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు వృత్తిలో మరిన్ని మెలకువలు అలవరచుకోవాలని తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని అసోసియేషన్ సభ్యులకు టపాకాయలు, స్వీట్ బాక్సులు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మణరావు, ప్రభ, గురు ఆచారి, జలంధర్, బాబు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

రాజారెడ్డికి పలువురి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న శీనురాయల్

తిరుపతి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జనసేన తిరుపతి నగర అధ్యక్షుడు రాజారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బైరాగిపట్టెడలోని పార్టీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల నడుమ కేక్ కట్ చేశారు. పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ఎస్.శీనురాయల్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి కూలీ మృతి



ఏర్పేడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌పై పనులు చేస్తూ కింద పడి కూలీ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. ఏర్పేడు హెడ్ కానిస్టేబుల్ రమణ కథనం మేరకు.. ఐఐటీ ఎదురుగా హర్షవర్ధన్‌రెడ్డి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నాడు. గుంటూరు జిల్లా వినుకొండ మండలం ముమ్మడివరానికి చెందిన గాలి మణికంఠ(29) ఐదేళ్ల క్రితం తిరుపతికి వచ్చేశాడు. తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతూరువద్ద నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో హర్షవర్ధన్‌రెడ్డి ఇంటిపనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో 6వ అంతస్తులో సెంట్రింగ్ పని చేస్తూ ప్రమాద వశాత్తూ కింద పడిపోయాడు. వెంటనే అతడిని ఇంటి యజమానికి తిరుపతి రుయాకు తరలించారు. అప్పటికే అతడు మరణించాడు. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐవీఎఫ్‌లో నైపుణ్యాల పెంపునకు కృషి

ఫెర్టీ9మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి



తిరుపతి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్‌లో ఆరోగ్య సంరక్షణ నిపుణుల పరిజ్ఞానం, నైపుణ్యాల పెంపునకు కృషి చేస్తున్నామని ఫెర్టీ9ఫెర్టిలిటీ కేంద్రం మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి సి.బుడి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లె రోడ్డులోని తాజ్‌హోటల్‌లో తిరుపతి అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజికల్ సొసైటీ సహకారంతో ఆదివారం వైద్య సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో దాదాపు 28 మిలియన్ల జంటలు సంతానోత్పత్తి సమస్యను ఎదుర్కొంటున్నాయని, నిశ్చల జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి, ఊబకాయం, ఇతర వైద్య పరమైన కారణాల వల్ల ఈ సంఖ్య పెరుగుతోందని తెలిపారు. పునరుత్పత్తి వైద్య రంగంలో కొత్త పరిజ్ఞానం, మెలకువలను వ్యాప్తి చేయడంలో ఇటువంటి సదస్సులు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ దీప్తి దామోదర, ఏపీ, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన గైనకాలజిస్టులు, ఐవీఎఫ్ నిపుణులు పాల్గొన్నారు.

ముగ్గురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

14 దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంగళం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట సమీపంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఎస్ఐలు విశ్వనాథ్, లింగాధర్ బృందాలు ఆదివారం భాకరాపేట అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. చిన్నగొట్టిగల్లు రోడ్డులోని కోటబయలు వద్ద కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కొందరు కనిపించారు. పట్టుకునే ప్రయత్నం చేయగా ఇద్దరు పారిపోయారు. ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితులు చిత్తూరుకు చెందిన వారిగా గుర్తించారు. వారి నుంచి 14 ఎర్రచందనం దుంగలు, కారు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మూతబడిన ధ్యానమందిరం



ధ్యానమందిరానికి తాళాలు వేసివున్న దృశ్యం

తిరుపతి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రామీణ మండలం మంగళం సప్తగిరికాలనీలోని సచివాలయ ఆవరణలో ఉన్న ధ్యానమందిరం శాశ్వతంగా మూతబడింది. రోజంతా గమనించినా తాళాలతో దర్శనమిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో సచివాలయం, ప్రాథమిక చికిత్స కేంద్రం, చిన్నపాటి ధ్యానమందిరం నిర్మించారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. అయితే కొన్ని రోజులకే ధ్యానమందిరానికి శాశ్వతంగా తాళాలు వేసేశారు. ప్రశ్నించినవారికి చిన్నపాటి మరమ్మతులున్నాయని సర్దిచెప్పి పంపేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా అదే పరిస్థితి కొనసాగుతోంది. పాలకులు సైతం ధ్యానమందిరంపై దృష్టిసారించలేదు. సచివాలయానికి, ఆస్పత్రికి వచ్చేవారు కూడా ధ్యానమందిరం చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి ప్రశాంతత కోసం ఇక్కడి వస్తే నిరాశతో వెనుతిరుగుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఆదివారం ఇదే ప్రాంతంలో పర్యటించనున్న ఎమ్మెల్యే పులివర్తి నాని దీనిపై దృష్టిపెట్టి తెరిపించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తిరుపతి

సంకటహర చతుర్దశి వేడుకలు

తిరుపతి (జీవకోన), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకనగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయకస్వామికి ఆదివారం సంకటహర చతుర్దశి సందర్భంగా ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పురోహితులు సురేష్‌స్వామి, ఆలయ ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపినాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, డీపీ ఆనంద్, మురళి, వాసు, వేలూరు పాపిరెడ్డి, కృష్ణయ్య, నాదమునిరెడ్డి, విజయలక్ష్మి, శాంతి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన ఆటోడ్రైవర్‌కు జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): లీలామహల్ ఫ్లైఓవర్‌పై నిబంధనలు అతిక్రమించి నడిచిన ఆటోకు ట్రాఫిక్ పోలీసులు ఆదివారం జరిమానా విధించారు. వాహన తనిఖీల్లో భాగంగా ఫ్లైఓవర్‌పై వన్‌వేలో ఎదురుగా వస్తున్న ఏపీ39టీఈ 9123 నంబరు ఆటోను పోలీసులు పట్టుకుని, జరిమానా విధించి పంపించారు. తొలిసారి పట్టుబడితే జరిమానాతో సరిపెడతామని, రెండవసారైతే వాహనాన్ని సీజ్ చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

16 నామినేషన్ల తిరస్కరణ

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో 16 తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు. మొత్తం 59 నామినేషన్లు వచ్చాయని, వివిధ కారణాలతో 16 తిరస్కరించామని వెల్లడించారు. మిగిలిన 43 నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని ఆర్వో చెప్పారు. సోమవారం విత్‌డ్రాల అనంతరం తుది జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు.

ఆదమరిస్తే బోర్లా పడాల్సిందే..!





పీఎల్ఆర్ హోటల్‌కి వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంత - డివైడర్‌ని తొలగించి అలాగే వదిలేసిన దృశ్యం

తిరుపతి(గాంధీరోడ్డు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు వెనుకవైపు నుంచి పీఎల్ఆర్ హోటల్‌కి వెళ్లే మార్గం మధ్యలో కంకర, సిమెంట్ పూర్తిగా తేలిపోయి పెద్ద గుంత తయారైంది. ప్రయాణికులు, భక్తులతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. సినిమా థియేటర్లు కూడా ఈ వీధిలో ఉండడంతో స్థానికులు కూడా ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. వందల సంఖ్యలో ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. వాహనాలను గుంతలో దిగి ఎక్కించడానికి డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా నిండా నీరుచేరి ఇక్కడ గుంత ఉందన్న విషయం కూడా వాహనదారులు, పాదచారులకు తెలియని విధంగా ఉంటోంది. మున్సిపల్ అధికారులు స్పందించి దీన్ని బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే సంధ్యా థియేటర్ వద్ద డివైడర్ని తొలగించి కొంతభాగం సిమెంట్‌తో పూడ్చి రెండు వైపులా సమం చేశారు. మరికొంత దూరం పూడ్చకుండా అలాగే వదిలేసి ఉన్నారు. దీంతో ఇటువైపు ప్రయాణించే వాహనదారులు జాగ్రత్త చూసుకుని వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

సీబీఎస్‌లో డీపీటీవో తనిఖీలు



అధికారులతో మాట్లాడుతున్న జగదీష్

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ ప్రజారవాణాధికారి జగదీష్ ఆదివారం సెంట్రల్ బస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఒంటరిగానే దుకాణ సముదాయంలోకి వెళ్లి వాటర్ బాటిల్ కొనుగోలు చేశారు. ఎమ్మార్పీ కంటే అధికంగా తీసుకోవడంతో ఆ దుకాణం నంబరును ఫిర్యాదు పుస్తకంలో నమోదు చేశారు. దుకాణాల నిర్వహణ, పారిశుధ్యం, ఆక్రమణలు, ఆహార పదార్థాల నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాల పార్కింగ్‌పైనా అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పరిస్థితులు మారేలా చర్యలు తీసుకోవాలని బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, డిపో మేనేజర్ బాలాజీలను ఆదేశించారు. ఫిర్యాదులు అందిన దుకాణాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అండర్ 19 జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. 23మంది ప్రాతినిధ్యం వహించగా ఎస్.కె.ఫర్హాన్ అహ్మద్, వై.ప్రీతమ్‌రెడ్డి, వి.విశ్వతేజ, ధీరజ్, కిరణ్‌కుమార్, షైక్‌జువేరియపాతిమ, వి.మధుశ్రీ, డి.నేహాలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26, 27 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరామయ్య, కోచ్ శివబాలాజీ అభినందించారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు



నిత్యావసర సరుకులు అందిస్తున్న మనోహర్‌చౌదరి

తిరుపతి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం గ్రామ పంచాయతీలోని దళితవాడలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిన రామకృష్ణ కుటుంబ సభ్యులను టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మనోహర్‌చౌదరి ఆదివారం పరామర్శించారు. వారిని ఓదార్చి బియ్యం, పప్పులు, కూరకాయలు అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో పలు వస్తువులు కాలిపోయాయని వివరించారు. దాదాపు రూ.1.7లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తిరుచానూరు జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం అండర్ 19 బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన 9మంది బాలికలు, 11మంది బాలురను ఎంపిక చేశారు. విజయవాడలో ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరామయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.మురళి, పీడీలు సురేంద్ర, శోభన్‌బాబు, చంద్రశేఖర్‌రాజు, పళని, కైలాష్, కుమార్, పట్టాభి పాల్గొన్నారు.

బలిజ భవన్ నిర్మాణానికి కృషి



ఐక్యత చాటుతున్న బలిజ హక్కుల సంరక్షణ సమితి సభ్యులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బలిజ భవన్ నిర్మాణానికి కృషి చేస్తామని బలిజ హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యండమూరి నాగేంద్రబాబు తెలిపారు. ఆదివారం డీఆర్ మహల్ రోడ్డులోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలిజ అభ్యున్నతి కోసం చేస్తున్న పోరాటానికి సహకరించాలని కోరారు. భవన్ శంకుస్థాపనకు బలిజ ప్రముఖులను ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో సమితి సభ్యులు శరణ్‌కుమార్(అడ్వొకేట్), వి.చంద్రమౌళి, ఎం.హరిరాయల్, పి.ఉమాపతి, ఎన్.హెచ్.తేజరాయల్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నాసిక్‌లో ఇటీవల జరిగిన జంపురోప్ జాతీయ స్థాయి పోటీలో బంగారు పతకం సాధించిన తిరుపతిలోని రామచంద్ర హైస్కూల్ విద్యార్థులు ఆదివారం సాయంత్రం కరకంబాడి రోడ్డులోని శాప్ కార్యాలయంలో ఛైర్మన్ ఎ.రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన క్రీడాకారులను, కోచ్‌లను అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శాప్ నుంచి సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



పల్లంరాజు

తిరుమల, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, నటుడు ధనరాజ్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేరువేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

హాకీ అకాడమీకి స్థలం కేటాయించండి



రజనీని సత్కరిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో హాకీ అకాడమీ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి ఈ.రజనీ శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడిని కోరారు. ఆదివారం కరకంబాడీ రోడ్డులోని ఆయన కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలసి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన ప్రయోజనాలు, డిప్యూటీ కలెక్టర్ స్థాయి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రవినాయుడు హామీ ఇచ్చారు. అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కోదండరామస్వామికి ముత్యాలహారం



వెండిముత్యాల హారం అందజేస్తున్న దాతలు

చంద్రగిరి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన ఎం.లక్ష్మి కుటుంబ సభ్యులు ఆదివారం 1673గ్రాముల వెండి హారాన్ని కానుకగా అందజేశారు. ప్రధాన అర్చకులు శ్రీనివాస బట్టర్‌స్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబులకు వారు అప్పటించారు. అనంతరం దాతలకు దర్శనం ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. తిరుమలలోని కర్ణాటక సత్రాల్లో నిర్మిస్తున్న కల్యాణ మండపం పైఅంతస్తులో సుమారు 45 ఏళ్ల వయసున్న వ్యక్తి చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని అక్కడి సిబ్బంది గుర్తించారు. భయంతో అక్కడి నుంచి వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు తలనీలాలు సమర్పించి నుదుట నామాలు ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసినవారు 94407 96771 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.





అటవీ ప్రాంతం నుంచి ఒక దుప్పి ఆదివారం రాత్రి తిరుపతి ఎన్‌జీవో కాలనీలోకి ప్రవేశించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంటి చుట్టూ తచ్చాడుతూ కనిపించింది. స్థానికులు తరిమినా అక్కడే తిరుగుతూ ఉండడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి దాన్ని అడవుల్లోకి తరిమారు. - తిరుపతి, ఆంధ్రజ్యోతి



పచ్చగా.. కనువిందుగా..

ఇలా పచ్చని మొక్కలతో.. కనువిందుగా ఉన్న ఈ డివైడరు ఉండేది తిరుపతి నగరం చింతలచేనుకు తూర్పుగా ఏర్పాటుచేసిన కులశేఖర్ ఆళ్వార్‌రోడ్డులో. రోడ్డు మధ్యలో దాదాపు 10అడుగుల వెడల్పుతో సువాసన ఇచ్చే పలు రకాల పుష్పాలు, పత్రాల మొక్కలను నాటారు. ఈ దారిలో రాకపోకలు సాగించే వారితో పాటు.. అటు పక్కన వెళ్లే రైలులోని ప్రయాణికులనూ ఆకట్టుకుంటున్నాయి. ఇటుగా వెళ్లే వారు డివైడరు వద్ద ఫొటోలు దిగుతున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ఇలా నెట్టుకొచ్చారు

కదిలితేనే బండి. లేదంటే మొండి. ఇలా మొరాయించిన ట్రాక్టరును ఆదివారం ఉదయం తిరుపతిలో తాపీ కూలీలు తోసుకుంటూ వెళ్లారు. భవనస్లాబ్ కోసం మిక్సర్, ఇతర పరికాలతో పాటు కూలీలు కరకంబాడి రోడ్డు సమీపం నుంచి ట్రాక్టర్, ట్రాలీతో బయలుదేరారు. లీలామహల్ సమీపానికి చేరుకోగా ట్రాక్టర్ ఆగిపోయింది. ఎంతకీ స్టార్టు కాకపోవడంతో మెకానిక్ షెడ్డు వరకు ఇలా తోసుకుంటూ వెళ్లారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



సోది చెబుతామమ్మా..



బుర్రలు చేతపట్టి 'సోదమ్మో సోది' అంటూ తీర ప్రాంత పల్లెల్లో తిరిగేవారు ఇటీవల పెరిగారు. వీరిపై నమ్మకంతో కొందరు మహిళలు సోది చెప్పించుకుంటున్నారు. గతంలో 'సోది' చెప్పే బుర్రక్కలకు ఆదరణ ఉండేది. ఇదే జీవనాధారంగా ఎన్నో కుటుంబాలు బతికాయి. మారుతున్న కాలాన్ని బట్టి సోది మాటే లేకుండా పోయింది. అయితే, దసరా నుంచి కోట, వాకాడు, చిట్టమూరు తదితర సముద్రతీర మండలాల్లో సోది బుర్రక్కల సందడి ఉంటోంది.

- కోట, ఆంధ్రజ్యోతి



సందర్శకులు బస చేసేందుకు ఏర్పాటు చేసిన కాటేజీ



గెస్ట్ హౌస్‌ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్‌లు



డార్మెటరీలో ఏర్పాటు చేసిన పడకలు

చుట్టూ ఎత్తయిన చెట్లు. స్వచ్ఛమైన గాలి. పక్షుల కిలకిలరావాలు. వీటి నడుమ ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకుంటున్నారా? ఉరుకుల పరుగుల జీవితం నుంచి కాసింత ఆహ్లాదానుభూతులను పొందాలనుకుంటున్నారా? అయితే, మామండూరు వెళ్లాల్సిందే.

- మంగళం, ఆంధ్రజ్యోతి

రారండోయ్.. మామండూరు

● మానసికోల్లాసానికి 'వాటర్ ఫ్లో'

ఎలా వెళ్లాలంటే..

కడప వెళ్లే దారిలో తిరుపతికి 22 కి.మీ. దూరంలో మామండూరు ఉంది. బస్సు లేదా సొంత వాహనాల్లో ఇక్కడకు చేరుకోవచ్చు. ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్లు లోపలకు వెళితే గెస్ట్‌హౌస్ ఉంటుంది. ఇక్కడకు మాత్రం బస్సు సౌకర్యం లేదు. సొంత వాహనాల్లో వెళ్లేవారు కార్లు, జీపులకు రూ.20, ఆటోకు రూ.15, ద్విచక్ర వాహనానికి రూ.10 చెల్లించాలి. గెస్ట్‌హౌస్ నుంచి కిలోమీటరు దూరంలో ముచ్చటగొలిపే నీటి ప్రవాహం (వాటర్ ఫ్లో) ఉంది.



గుంట మడుగు వద్ద వాచ్ టవర్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న సందర్శకులు

ఎంచక్కా బస చేయవచ్చు

ప్రవేశ రుసుం రూ.30 చెల్లించి సాయంత్రం వరకూ ప్రకృతి అందాలను చూడవచ్చు. కటక్, గుంజర, తుంబుర, హరిణి, మయూరి పేర్లతో కాటేజీలున్నాయి. రోజుకు రూ.3వేలు చెల్లించాలి. రెండు బెడ్లు ఉంటాయి. డార్మెటరీకి రూ.6వేలు చెల్లించాలి. ఇందులో 10 బెడ్లు ఉంటాయి. 'వనదర్శిని' వెబ్‌సైట్ ద్వారా గదులు బుక్ చేసుకోవచ్చు. బస చేసేవారు ఆహారాన్ని తీసుకెళ్లవచ్చు. లేదనుకుంటే వండి సరఫరా చేసేందుకు ఓ క్యాంటీన్ ఉంది. ముందుగా ఆర్డర్ ఇస్తే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం తయారు చేస్తారు.

ఎప్పుడు అనుకూలం

తిరుమల కొండల్లోని పాపవినాశనం, గోగర్భం డ్యాం నిండాక నీరు ఇక్కడకు చేరుకుంటుంది. వర్షాల సమయంతో జలపాతాలు కనువిందుచేస్తాయి. నడుము లోతు వరకు వచ్చే ఈ నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ఈత కొడుతూ మైమరచిపోతారు. ప్రమాదం లేకుండా జలకాలాడటానికి ఇక్కడి వాతావరణం అనుకూలం. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు నీటి ప్రవాహం ఉంటుంది. రోజూ దాదాపు 1,500మంది, అన్‌సీజన్‌లో 400మంది వస్తుంటారు. పిల్లలు ఆడుకోడానికి కొన్ని సౌకర్యాలున్నాయి.



మామండూరు వద్ద వాటర్ ఫ్లో

త్వరలో జంగిల్ సఫారి



సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచడానికి త్వరలో జంగిల్ సఫారీ ప్రారంభించబోతున్నాం. గెస్ట్ హౌస్ నుంచి అటవీ ప్రాంతంలో దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహనాల్లో వెళ్లి రావడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు రోడ్డు వేశారు. జంగిల్ సఫారీలో అందమైన అటవీప్రాంతాన్ని వీక్షించవచ్చు.

- గౌస్ కరీం, డీఆర్వో

రైతు మోమున లాభాల గుబాళింపు

● పూలసాగుపై పెరుగుతున్న ఆసక్తి

● పండగలొస్తే మరింత లాభసాటి ● వర్షాలకు అడపాదడపా నష్టం

ఎర్రావారిపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి: ఎర్రావారిపాలెం మండలంలోని రైతులు పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల దసరా సందర్భంలో మంచి గిట్టు బాటు ధర లభించడంతో వీరిలో ఆనందం వ్యక్తమవుతోంది. సుమారు రెండునెలల్లోనే చేతికందడంతో ఎక్కువమంది బంతి పూలసాగు వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రస్తుతం కిలో బంతిపూల ధర రూ.40కి తక్కువ లేకుండా పలుకుతోంది. పండుగ సందర్భాల్లో ధర మరింత పెరిగి లాభసాటిగా మారుతోంది. బంతితోపాటు ఇతర పూల పంటలనూ సాగుచేస్తున్నారు. రోజాలు కిలో రూ.160, సెంటు మల్లెలు రూ.200 చొప్పున ధర పలుకుతున్నాయి. మండలంలోని పెద్దనాయనపల్లె, బడగన పల్లె,ఎల్లమంద, ఉస్తికాయల పెంట గ్రామాల్లో రైతులు బంతి సాగు చేస్తున్నారు. భాకరాపేట-తలకోన రోడ్డు పక్కనే పెద్దనాయనిపల్లె వద్ద సాగు చేసిన పూలతోటలకు మంచి డిమాండు ఉంది. రోడ్డు పక్కనే ఉండడంతో తోటలోని పూలు కోసి వెంటనే ఇస్తుండటంతో చాలామంది ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. దీంతో దళారుల బెడద, కమీషన్ లాంటివి లేకుండా వెంటనే చేతికి డబ్బు అందుతోందని చెప్పారు. వ్యాపారులకు పూలను సరఫరా చేస్తే కమీషన్, తోపుడు రిస్కు(అదనంగా పూలు) ఉంటాయంటున్నారు. డబ్బులు సరిగా చెల్లించకపోవడంతో అడపాదడపా నష్టపోతున్నామంటున్నారు. రానున్న దీపావళి పండుగ సందర్భంలోనూ మంచి ధర పలుకుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. వర్షాలొస్తే పూల రేకుల్లో నీరు చేరితే కుళ్లిపోయినా, నానినా నాణ్యత తగ్గుతుంది. ఇలాంటప్పుడు తక్కువ ధరకు అమ్మి వీరు నష్టపోతున్నారు. వర్షాకాలంలో చీడ పీడలు, తేమ శాతం ప్రతికూలంగా పరిణమిస్తున్నాయి. ఉద్యాన అధికారులు అధిక దిగుబడినిచ్చే విత్తన మొలకలు సరఫరా చేస్తే నాణ్యమైన పూలతోటలను సాగు చేసి మరిన్ని లాభాలు ఆర్జిస్తామని రైతులు చెబుతున్నారు.





అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. చెన్నైకు చెందిన శ్రీశంకర నాట్యాలయ వారు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు హర్షదా, అనూష, అక్షర, సహానా, రోషికా, దీప్తి, సంగీత, ధాన్వియ, ప్రగతి, బవదర్శిని తదితరులు శివ శ్లోకం, శ్రీరామచంద్రుడు, స్వాగతం కృష్ణా సుస్వాగతం కృష్ణా, కన్నన్ వరుగింద్ర నీరం, అదిదానో రంగా, తోడై మంగళం, హరే రామ రామ గోవింద హరే వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వారిని ఆదివారం తెలంగాణ, మద్రాసు హైకోర్టుల న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ సుధీర్ కుమార్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వీరు మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ రాజేశ్వరరావు



జస్టిస్ సుధీర్‌కుమార్

శ్రీవారికి కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చాం

తిరుమల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గోపిచంద్ 'విశ్వం' సినిమాకు పెద్ద విజయాన్ని ఇచ్చిన క్రమంలో వేంకటేశ్వరస్వామిని కృతజ్ఞతలు తెలుపుకునేందుకు వచ్చామని ఆ చిత్ర దర్శకుడు శ్రీను వైట్ల తెలిపారు. నిర్మాత వేణుదోనేపూడి, నటుడు శ్రీకాంత్‌తో కలిసి ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా శ్రీను వైట్ల ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. స్వామికి ఎప్పటికి రుణపడి ఉంటామన్నారు. విశ్వం చిత్రాన్ని హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలన్నారు. 'దేవర' సినిమాలో భాగస్వామిని కావడం సంతోషంగా ఉందని నటుడు శ్రీకాంత్ తెలిపారు. కొన్ని కారణాల వల్ల గోపిచంద్ దర్శనానికి రాలేకపోయారని, ఆయన బదులుగా తాను ఉన్నట్టు అందరు భావించాలన్నారు. తాను నటించిన గేమ్‌చేంజర్ సంక్రాంతికి విడుదల కానుందన్నారు. కల్యాణ్‌రామ్, సాయిధరమ్ తేజ్‌తో నటించిన చిత్రాలు కూడా త్వరలో విడుదల కానున్నాయన్నారు. వీటి తర్వాత తాను హీరోగా చేస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు. తన కుమారుడు రోషన్ 'ఛాంపియన్' అనే సినిమా షూటింగ్‌లో బీజీగా ఉన్నాడని ఓప్రశ్నకు బదులిచ్చారు.



ఆలయం ఎదుట శ్రీను వైట్ల, శ్రీకాంత్, వేణు దోనేపూడి

మొదటిఘాట్‌లో అదుపుతప్పిన కారు





ప్రమాదానికి గురైన కారు - క్షతగాత్రులు

● ముగ్గురికి గాయాలు

తిరుమల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో ఆదివారం కారు అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. తమిళనాడుకు చెందిన భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఆదివారం ఉదయం తిరుమల నుంచి తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 15వ మలుపు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. కుడివైపు నున్న క్రాష్‌బ్యారియర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఇద్దరు చిన్నారులతో పాటు ఓ మహిళ గాయపడ్డారు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో తిరుపతికి రుయా ఆస్పత్రికి తరలించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుమల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 80,741 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,581 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

మందలించాడని..

● కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేసిన విద్యార్థి

● పోలీసుల అదుపులో బాలుడు.. కేసు నమోదు

తిరుచానూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భోజనం చేస్తున్న సమయంలో మందలించారని.. తన ప్రవర్తన తీరుపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని ఆగ్రహించిన విద్యార్థి.. క్షణికావేశంతో కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం అడుసుపల్లికి చెందిన వెంకటరమణ తిరుపతిలోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో క్యాంపస్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. ఆయన తిరుచానూరులోని బ్రాంచిలో ఉన్నారు. పీలేరుకు చెందిన ఇంటర్ విద్యార్థి.. దసరా సెలవులకు వెళ్లి ఆదివారం రాత్రి క్యాంపస్‌కు వచ్చాడు. రాగానే కళాశాలలో పనిచేసే ఉద్యోగి వెంకటరమణ ఫీజు అడగారు. సమాధానం లేకపోవడంతో అక్కడ కూర్చోబెట్టారు. అదే సమయంలో అతడి తల్లిదండ్రులకు ఫోను చేయగా వారి నుంచి సమాధానం లేదు. అంతకు ముందే ఆ విద్యార్థిపైన కళాశాలలోని వారు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో వారు తీవ్రస్థాయిలో అతడిని మందలించారు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆ విద్యార్థి.. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆదివారం రాత్రి కళాశాలకు రావడం.. ఫీజు విషయమై ప్రశ్నించారు. అప్పటికే తనపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని, తాను భోజనం చేసే సమయంలో అందరి ముందు అసభ్యంగా మాట్లాడారని ఉద్యోగి రమణపై కోపం పెంచుకున్న విద్యార్థి.. బ్యాగులోని కత్తి తీసి దాడి చేశాడు. కళాశాల యాజమాన్యం విద్యార్థిని తిరుచానూరు పోలీసులకు అప్పగించి, గాయపడిన వెంకటరమణను రుయాకు తరలించారు. అతడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షణికావేశంలో తాను దాడికి పాల్పడినట్లు విద్యార్థి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.



గాయపడిన వెంకటరమణ

ప్రకాశంకాలనీలో కార్డెన్ సెర్చ్


పోలీసులు స్వాధీనం చేసుకొన్న బైక్‌లు

కోట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీ ప్రకాశంకాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆదేశాల మేరకు కోట, వాకాడు, చిట్టమూరు ఎస్‌ఐలు పవన్‌కుమార్, నాగబాబు, చిన్నబలరామయ్యతో పాటు ఏఎస్‌ఐ శోభారాణి ప్రకాశం కాలనీలో తనిఖీలు చేపట్టారు. సరైన రికార్డులు లేని ఏడు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

సచివాలయ ఇంజనీరు అసిస్టెంట్‌పై దాడి దారుణం

వెంకటగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిపేట సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయిపై 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్ దాడికి పాల్పడటం దారుణమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, అరవ మంజుల ఖండించారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి విధినిర్వహణలో తప్పుచేసి ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి అతనిపై శాఖా పరంగా చర్యలు తీసుకోవాలే తప్ప దాడులకు దిగడం సరికాదన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ జోక్యం చేసుకొని దాడికి పాల్పడిన కౌన్సిలర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే పాశిం



వాకాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలం మొలగనూరు గ్రామంలోని ముత్యాలమ్మను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి, జనార్ధనరెడ్డి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, అన్నమేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

14 దుంగల స్వాధీనం


పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంగళం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట సమీపంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఎస్‌ఐలు విశ్వనాథ్, లింగాధర్ బృందాలు ఆదివారం భాకరాపేట అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. చిన్నగొట్టిగల్లు రోడ్డులోని కోటబయలు వద్ద కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కొందరు కనిపించారు. పట్టుకునే ప్రయత్నం చేయగా ఇద్దరు పారిపోయారు. ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితులు చిత్తూరుకు చెందిన వారిగా గుర్తించారు. వారి నుంచి 14 ఎర్రచందనం దుంగలు, కారు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హాకీ అకాడమీకి స్థలం కేటాయించండి


రజనీని సత్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో హాకీ అకాడమీ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి ఈ.రజనీ శాప్ చైర్మన్ ఎ.రవినాయుడిని కోరారు. ఆదివారం కరకంబాడీ రోడ్డులోని ఆయన కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలసి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన ప్రయోజనాలు, డిప్యూటీ కలెక్టర్ స్థాయి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రవినాయుడు హామీ ఇచ్చారు. అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హంసధ్వని పుస్తకావిష్కరణ



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో సమగ్ర సమాచారం కోసం హంసధ్వని పుస్తకం ఉపకరిస్తుందని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య దక్షిణామూర్తి శర్మ అన్నారు. అమెరికాలో ఉంటున్న ఐటీ ఉద్యోగి మరువాడ భీమశంకర్ రచించిన హంసధ్వని పుస్తకావిష్కరణ సభ ఆదివారం రామకృష్ణమఠంలో జరిగింది. డీన్ మాట్లాడుతూ ఈ పుస్తకం చదవడం ద్వారా సంగీతానికి సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఎస్వీ యూనివర్సిటీ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం మాజీ అధిపతి ఆచార్య ఎస్.పద్మ మాట్లాడుతూ ప్రముఖ సంగీత జ్ఞాని నూకల చినసత్యనారాయణ బాణీని అనుసరిస్తూ భీమశంకర్ సంగీతంలో మంచి పుస్తకాన్ని ప్రచురించారని తెలిపారు. ఈ పుస్తకాన్ని ఎస్వీ సంగీత కళాశాల గాత్ర విభాగాధిపతి డాక్టర్ ఏ శబరి గిరీష ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజక్టు సంచాలకులు సి.లత, వ్యాపారవేత్త సి.దివాకర రెడ్డి, పరిహార సేవా సమితి అధ్యక్షుడు భరద్వాజ చక్రపాణి, గేయరచయిత జిల్లెల్ల ప్రసాద్, ఎస్.ప్రమీల, కె.సుబ్రమణ్యం, ఎ.నాగలక్ష్మి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డాక్టర్ శబరి గిరీష నిర్వహించిన గాత్ర కచేరి ఆహూతులను అలరించింది. వీరికి ఎల్‌జి రామ్ (వయోలిన్), ఎఎస్ శంకర్(మృదంగం) సహకారం అందించారు.

మెకానిక్‌లకు ఈఎస్‌ఐ కల్పనకు కృషి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మెకానిక్‌లకు ఈఎస్‌ఐ వైద్య సదుపాయం కల్పనకు కృషి చేస్తామని టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. మార్కెట్లోకి ఆధునిక టెక్నాలజీతో వస్తున్న వాహనాల పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు వృత్తిలో మరిన్ని మెలకువలు అలవరచుకోవాలని తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని అసోసియేషన్ సభ్యులకు టపాకాయలు, స్వీట్ బాక్సులు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మణరావు, ప్రభు, గురు ఆచారి, జలంధర్, బాబు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

16 నామినేషన్ల తిరస్కరణ

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో 16 తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు. మొత్తం 59 నామినేషన్లు వచ్చాయని, వివిధ కారణాలతో 16 తిరస్కరించామని వెల్లడించారు.

ప్రభుతకు పట్టని పుస్తక కేంద్రాలు

- అభివృద్ధికి నోచని గ్రంథాలయాలు
- శిథిల భవనాల్లో పుస్తక పఠనం
- సెస్సు బకాయిలు రూ.40.06కోట్లు
- నత్తనడకన కొత్త భవన నిర్మాణం
- పాలకమండలి లేక కదలిక శూన్యం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. వేలాది పుస్తకాలతో అన్ని వయసుల వారికి సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందించే నిలయాలు. అటువంటి గ్రంథాలయాలు జిల్లాలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లా ప్రధాన గ్రంథాలయంలో కూర్చోవాలంటే పాఠకులు భయపడుతున్నారు. కొత్త భవనం పూర్తికాక, ఉన్నదేమో శిథిలమై, నూతనత్వానికి నిధుల్లేక జిల్లా గ్రంథాలయ సంస్థ భారంగా రోజులు ఈడుస్తోంది.


డీఎస్పీ 9888: జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన గ్రంథాలయంతో పాటు జిల్లాలో 61 శాఖలున్నాయి. వీటిలో నెల్లూరు రేబాల వారి వీధిలోని ప్రధాన గ్రంథాలయ, గ్రంథాలయ సంస్థ కార్యాలయ భవనం సుమారు వందేళ్ల కిందటిది. ఆ భవంతి శిథిలమై పైకప్పు కూలేందుకు సిద్ధంగా ఉంది. పెచ్చులూడిపడి పాఠకులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి 2019లో అప్పటి, ప్రస్తుత మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ రూ.3కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొత్త భవనం పునాదులకే పరిమితమైంది. పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది ఆందోళనలతో ఆ తర్వాత రూ.కోటి చెల్లించారు. దీంతో భవన నిర్మాణం మొదటి అంతస్తు వరకు జరిగి ఆగిపోయింది. ప్రధానమైన ఈ గ్రంథాలయానికి అన్ని వయసుల వారు వస్తుంటారు. ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 50మందికిపైగా చదువుకుంటూ ఉంటారు. అయితే శిథిల భవనం వల్ల వారు ఏకాగ్రతతో చదువుకోలేని పరిస్థితి నెల కొంది. ఇదికాక జిల్లాలోని కొన్ని శాఖా గ్రంథాలయాల భవనాలు కూడా దెబ్బతిన్నాయి. వాటికీ మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

పాలక మండలిని పట్టించుకోరే?

గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు చైర్మన్ తప్ప కమిటీని నియమించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు పాలకమండలి నియామకంపై దృష్టిపెట్టలేదు. ఈ పరిణామం అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. జిల్లాలోని గ్రంథాలయాలకు 2020 - 2021 సంవత్సరంలో కంప్యూటర్లు కొనుగోలు చేశారు. కానీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించడంలేదు.

వారసత్వ సంపదగా జిల్లా కేంద్ర గ్రంథాలయం

నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనానికి 100 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉండడంతో దానిని వారసత్వ సంపదగా పరిగణించాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆయన ఈనెల 10వ తేదీన జిల్లా గ్రంథాలయ సంస్థను సందర్శించారు. భవన మరమ్మతులకు నిధులిస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ సంస్థ కొత్త భవనం పూర్తయ్యాక ప్రస్తుత భవనాన్ని వారసత్వ సంపదగా పురావస్తుశాఖకు అప్పగిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పాత భవనం మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో సెస్సు బకాయిలు ఇలా..

నెల్లూరు నగర పాలక సంస్థ	- రూ.34,27,26,407
కావలి పురపాలక సంస్థ	- రూ.1,19,46,383
గూడూరు పురపాలక సంస్థ	- రూ.87,62,092
ఆత్మకూరు పురపాలక సంస్థ	- రూ.50,27,005
వెంకటగిరి మున్సిపాలిటీ	- రూ.45,86,000
నాయుడుపేట మున్సిపాలిటీ	- రూ.44,96,978
బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ	- రూ.11,12,091
అల్లూరు నగర పంచాయతీ	- రూ.2,43,000
మొత్తం	- రూ.40,05,96,347

పన్నులు చెల్లిస్తేగా..

గ్రంథాలయాలకు ప్రధాన ఆర్థిక వనరు స్థానిక సంస్థలు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు ప్రజలు చెల్లించే ఇంటి పన్నుల్లో 2 శాతం గ్రంథాలయ సెస్సుగా వసూలు చేస్తారు. ఆ మొత్తాన్ని గ్రంథాలయ సంస్థకు జమ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ ఎప్పటికప్పుడు జరగకపోవడంతో గ్రంథాల యాల అభివృద్ధికి, సిబ్బంది జీతాలు, పింఛన్ల చెల్లింపునకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. సెస్సు బకాయిలు కోసం గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సమీక్షా సమావేశాల్లో గ్రంథాలయ సెస్సులు చెల్లించాలని ఆదేశించినా నెల్లూరు నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు బేఖాతరు చేస్తూనే ఉన్నాయి. ఆ నిధులు గ్రంథాలయ సంస్థకు ఎప్పుడు చేరుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

సూళ్లూరుపేటలో మోటారు సైకిల్ చోరీ

తడలో లభ్యం

సూళ్లూరుపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో చోరీకి గురైన మోటారు సైకిల్ తడ మండలంలో లభ్యమైంది. బాధితుడు కథనం మేరకు... పట్టణంలోని పరమేశ్వరినగర్ సమీపంలో శ్రీహరికోటకు వెళ్లే రోడ్డులో ఫాస్ట్‌ఫుడ్ నిర్వహిస్తున్న శ్యామ్ శుక్రవారం రాత్రి తన మోటారు సైకిల్‌ను తన హోటల్ ముందు పెట్టి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి మోటారు సైకిల్ లేదు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ముందున్న సీసీ కెమెరాలో పుటేజ్‌లను పరిశీలించగా ఇద్దరు యువకులు వచ్చి మోటారు సైకిల్‌ను తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం సాయంత్రం చోరీకి గురైన మోటారు సైకిల్ తడ మండలం కొండూరు వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. బాధితుడు అక్కడకెళ్లి మోటారు సైకిల్ తెచ్చుకొన్నాడు. ఇటీవలలో పట్టణంలో ఇళ్లు, షాపుల ముందు పెట్టిన మోటారు సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. పోలీసులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న ఆటో

ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - చంద్రబాబ కాలనీ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తడ మండలం పూడికుప్పం ప్రాంతానికి చెందిన మల్లికమ్మ, ధర్మన్ మోటారు సైకిల్‌పై నెల్లూరుకు వెళ్తుండగా నాయుడుపేట సమీపంలోకి రాగానే ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లికమ్మ, ధర్మన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

సంకటహర చతుర్థశి వేడుకలు

తిరుపతి (జీవకోన), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకనగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయకస్వామికి ఆదివారం సంకటహర చతుర్థశి సందర్భంగా ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పురోహితులు సురేష్‌స్వామి, ఆలయ ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపినాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, డీపీ ఆనంద్, మురళి, వాసు, వేలూరు పాపిరెడ్డి, కృష్ణయ్య, నాదమునిరెడ్డి, విజయలక్ష్మి, శాంతి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చెస్ క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అండర్ 19 జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. 23మంది ప్రాతినిధ్యం వహించగా ఎస్.కె.ఫర్హాన్ అహ్మద్, వై.ప్రీతమ్‌రెడ్డి, వి.విశ్వతేజ, ధీరజ్, కిరణ్‌కుమార్, షైక్‌జువేరియ ఫాతిమ, వి.మధుశ్రీ, డి.నేహాలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 26, 27 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరామయ్య, కోచ్ శివబాలాజీ అభినందించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తిరుచానూరు జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం అండర్ 19 బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన 9మంది బాలికలు, 11మంది బాలురను ఎంపిక చేశారు. విజయవాడలో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరామయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.మురళి, పీడీలు సురేంద్ర, శోభన్‌బాబు, చంద్రశేఖర్‌రాజు, పళని, కైలాష్, కుమార్, పట్టాభి పాల్గొన్నారు.


వర్షపునీటిలో దొడ్డవారిమిట్ట కాలనీ - టెంకాయతోపు గ్రామంలోని వీధిలో నిల్వ చేరిన నీళ్లు

జలదిగ్బంధంలో గ్రామాలు

చెరువులను తలపిస్తున్న వీధులు

పెళ్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు నెలబల్లి పంచాయతీ పరిధిలోని టెంకాయతోపు, దొడ్డవారిమిట్ట గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. టెంకాయతోపు గ్రామంలోని వీధుల నిండా వర్షపునీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. దొడ్లవారిమిట్ట కాలనీలోని ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరడంతో రెండు గ్రామాలు ఎక్కడో దీవుల్లో ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. టెంకాయతోపు గ్రామంలో ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీటితో పాటు వర్షపు నీరు బయటకు పోవడానికి గతంలో జాతీయ రహదారి పక్కనే డ్రైనేజి కాలువ ఉండేది. ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులతో ఆ కాలువ పూడిపోయి కనుమరుగైంది. దీంతో ఎక్కడికక్కడ నీరు బయటకుపోయే దార్లు మూసుకుపోయాయి. ఇంట్లో నుంచి కాలు బయట పెట్టాలంటే మురుగుతో కూడిన వర్షపునీటిలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధుల్లో నడిస్తే కాళ్లు పాచిపట్టి పుండ్లు అయిపోతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణం మొదలైన నాటి నుంచి గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం వచ్చినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధుల్లో నుంచి వర్షపునీళ్లు బయటకుపోయేలా చర్యలు తీసుకోవాలని టెంకాయతోపు, దొడ్లవారిమిట్ట గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే విజయశ్రీ పర్యటన

పెళ్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సూళ్లూరు పేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సోమవారం పెళ్లకూరు మండలంలో పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. చెంబేడు, చెన్నప్ప నాయుడుపేట, శిరసనంబేడు గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయ నున్నట్లు ఆయన వివరించారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు

పెళ్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. గణపతి పూజ, కలశ పూజ, హోమాలు నిర్వహించారు. మాజీ సర్పంచు అరుణమ్మ రూ.60 వేల విలువ కలిగిన వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు.

అన్నదానం

గూడూరు అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీలోని నారాయణమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున నారాయణమ్మ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆ తరువాత వచ్చే ఆదివారం ఆలయంలో అన్నదానం చేయడం ఆనవాయితీ.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. తిరుమలలోని కర్ణాటక సత్రాల్లో నిర్మిస్తున్న కల్యాణ మండపం పైఅంతస్తులో సుమారు 45 ఏళ్ల వయసున్న వ్యక్తి చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని అక్కడి సిబ్బంది గుర్తించారు. భయంతో అక్కడి నుంచి వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు తలనీలాలు సమర్పించి నుదుట నామాలు ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసిన వారు 94407 96771 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

మట్టలమ్మ గ్రామోత్సవం



కోట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిధిలోని ఉత్తమనెల్లూరులో ఆదివారం మట్టలమ్మ గ్రామోత్సవం జరిగింది. ఉత్తమనెల్లూరుతో పాటు ఇలకూరుపాడు, తాటిగుంట చెరువు గ్రామాల్లో మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగించారు. గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టంగుటూరి ప్రకాశంపంతులు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో 130మందికి వైద్య పరీక్షలు చేసి 80 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ట్రస్టు సీఈవో సీతారామ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఏవో కృష్ణ, డాక్టర్ లహరి, అరవింద్ నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు కోడిగుడ్లు పంపిణీ

గూడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలకృష్ణంరాజు దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, నాగరాజు, రాధయ్య, ప్రభాకర్, మురళీ సింగ్, జగదీష్, సురేష్, సాయికిరణ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

కత్తితో దాడి: ఒకరికి గాయాలు

కోట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కోట మండలం ఉత్తమనెల్లూరు మట్టాలమ్మ పొంగళ్లల్లో ఆదివారం రాత్రి హేమంత్ అనే యువకుడు ప్రసాద్ అనే వ్యక్తిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఉత్తమనెల్లూరులో మట్టాలమ్మ గ్రామోత్సవం జరిగింది. గ్రామంలోని రెండు వర్గాలు అమ్మవారికి పొంగళ్లు పెడుతుండగా హేమంత్ మేకపోతును నరికే కత్తిని ప్రసాద్‌పై విసిరాడు. కత్తి ప్రసాద్ వీపుకి తగిలి తీవ్రంగా గాయ పడ్డాడు. అతనిని కోట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

సూళ్లూరుపేట/తడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ నెల 22న మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నాయి. శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడల్లోని దాదాపు 50 పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

నేడు ఓజిలిలో పల్లెపండుగ

ఓజిలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయ కుమార్ నాయుడు తెలిపారు. మండలంలోని పున్నేపల్లి, నెమళ్ళపూడి, కరబల్లవోలు పంచాయతీల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమం 444కి చేరింది. ఆదివారం గాండ్లవీధికి చెందిన కర్లపూడి సాత్విక్ దత్త(7) మృతి చెందాడు. బాలుడు కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదానం చేశారు. బాలుడి కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు పంపారు. కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరామ్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

పెళ్లకూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని దొడ్లవారిమిట్ట గిరిజనకాలనీలో పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహించారు. రూ.8 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఉపాధి సిబ్బంది వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన

చిట్టమూరు, అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోగిలి పంచాయతీలోని మద్దిలేటమ్మ కండ్రిగ, సోమసముద్రం, పేరింట్రాలమిట్ట, గొల్లపాళెం, రాఘవేంద్రపురం గ్రామాల్లో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, రషీద్ బాషా, పోలయ్య, మాజీ ఎంపీటీసీ ముజీమీర్ పాల్గొన్నారు.

కటాలమ్మకు పూజలు

గూడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గల కటాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

శ్రీకాళహస్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమ వారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మంత్రిని కలిసిన చెంచయ్యనాయుడు



శ్రీకాళహస్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మంత్రి అచ్చెన్నాయుడును ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేనిచెంచయ్యనాయుడు మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌ను కలిశారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

శ్రీకాళహస్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండల పరిధిలోని బాణసంచా దుకాణాలను ఆదివారం తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తనిఖీ చేశారు. దుకాణదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నిబంధనలను అతిక్రమించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్లెపండుగతో అభివృద్ధి

శ్రీకాళహస్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ నాయకులు అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు హరిజనవాడలో సైడు కాలువలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామేష్‌యాదవ్, చెంచయ్యనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

రేణిగుట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. 2017లో ఓ హత్యాయత్నం కేసులో రేణిగుంట మండలం తారకరామానగర్ పంచాయతీకి చెందిన అక్కుల పార్థసారథి నిందితుడు. ఆరు నెలల నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో తిరుపతి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఆ మేరకు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ముందు హాజరు పరచగా 14రోజులు రిమాండ్ విధించారు.

అలరించిన హరికథా గానం




శ్రీసిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన ప్రముఖ హరికథా విద్వాంసుడు, 'హరికథా దురంధర' బిరుదాంకితుడు వెంకటేశ్వర్లు భాగవతార్ శ్రీసిటీలో ఆలపించిన పద్మావతి హరికథా గానం శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది. శ్రీనివాసుడు, పద్మావతి దేవిల దివ్య వివాహాన్ని ఆయన ఎంతో ఆసక్తిగా కళ్లకు కట్టినట్లు వివరించారు. వెంకటేశ్వర్లు భాగవతార్‌కు, సహచర కళాకారులకు శ్రీసిటీ ఎండీ డా. రవీంద్ర సన్నారెడ్డి జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ సమన్వయకర్తగా వ్యవహరించారు. శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సీసీరోడ్లకు భూమిపూజ



సత్యవేడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు పంచాయతీ పరిధిలోని ఉలవచేను, దళవాయి అగ్రహారంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహించారు. రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న నూతన సీసీరోడ్ల నిర్మా ణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ మంజుల రమేష్, సెక్రటరీ రవికుమార్, ఈవోపీఆర్డీ తరుణాక్ష రెడ్డి, మండల అసిస్టెంట్ ఇంజనీర్ ఇబ్రహీంఖాన్, నాయకులు పరవశివం, రాధయ్య, అమాసరెడ్డి, శశి మోహన్, సురేంద్రరెడ్డి, హేమ భూషణం, షణ్ముగం, సురేష్, దిలీప్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి జన్మదినం



శ్రీకాళహస్తి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్ జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన జన్మదిన వేడుకలను కేరళలోని వాయినాడ్ ప్రాంతంలో పార్టీ నాయకులతో కలిసి చేసుకున్నారు. వరదతో నిరాశ్రయులైన వాయినాడ్ ప్రజలను పరామర్శించారు. శ్రీకాళహస్తిలో ఆయన అనుచరులు, అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నింద్ర సుధాకర్, హేమంత్‌కుమార్, గుత్తా విజయ కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మృతి

వరదయ్యపాళెం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బు ఇవ్వలేని ఆత్మహత్యా యత్నం చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నెలటూరులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లికార్జున్ కథనం మేరకు.. మండలంలోని నెలటూరుకు చెందిన గురవయ్య(41)మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 8న భార్యను మద్యానికి డబ్బు ఇవ్వాలని అడిగాడు. అందుకు ఆమె నిరాకరించింది. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో గడ్డి మందు తాగేశాడు. అపస్మారకస్థితిలో ఉండగా గుర్తించి వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోమొబైల్ నగర్‌ను ఏర్పాటు చేయాలి



సమావేశమైన ఆటో మెకానికల్ ఇంజనీరింగ్ వెల్ఫేర్ యూనియన్ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రాంతంలో ఆటో మొబైల్ నగర్‌ను ఏర్పాటు చేయాలని ఆటో మెకానికల్ ఇంజనీరింగ్ వెల్ఫేర్ యూనియన్ నాయకులు కోరారు. ఆదివారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోపినాయుడు మాట్లాడుతూ పట్టణంలో మెకానికల్ షెడ్లు, ఇంజనీరింగ్ వర్క్‌షాప్, గ్యాస్ వెల్డర్, ట్రాక్టరు ట్రక్కులు తయారీకి స్పేర్‌పార్ట్స్‌కు ఎంతో కాలంగా సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం ప్రత్యేక ఆటో మొబైల్ నగర్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్‌గౌడ్, మునిగోపాల్, సాధిక్‌బేగ్, మణి, రవినాయుడు, తిరుపతిరెడ్డి, చెంగల్‌రాయలు, మీర్జాబేగ్, మునికృష్ణ పాల్గొన్నారు.

గుండ్లకండ్రిగలో అక్రమ నిర్మాణాలు తొలగించండి



ప్రభుత్వ స్థలంలో వైసీపీ నేత నిర్మిస్తున్న భవనం

ఏర్పేడు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని గుండ్లకండ్రిగ పంచాయతీ సర్వే నెంబరు 70లో ఉన్న ప్రభుత్వ స్థలంలో కొందరు వైసీపీ నేతలు అక్రమంగా వారం రోజులుగా నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలను తొలగించాలని గ్రామస్తులు అధికారులకు ఆదివారం ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని లేనిపక్షంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

ఎదురుచూపులే మిగిలాయి..!

ఇప్పటికీ పూడిగుడిసెల్లోనే జీవనం ● పక్కా ఇళ్లు మంజూరు చేయాలని వినతి



కంచరపాళెం గిరిజనకాలనీలో గుడిసెల దుస్థితి

వరదయ్యపాళెం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల బతుకులు మాత్రం మారడంలేదు. ఇప్పటికీ వారు చాలీచాలని, పడిపోయే దశలో ఉన్న పూరి గుడిసెల్లోనే జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. వరదయ్యపాళెం మండలంలోని కంచరపాళెం పంచాయతీ గిరిజనకాలనీలో సుమారు 60 కుటుంబాల గిరిజనులు నివసిస్తున్నారు. వీరు గత ప్రభుత్వానికి తమకు పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరినా వారి గోడును పట్టించుకోలేదు. ఓట్ల కోసమే వస్తారు తప్ప తమ గోడును మాత్రం నాయకులు, అధికారులు పట్టించు కోవడం లేదని వాపోతున్నారు. 40 సంవత్సరాలుగా వారు అక్కడే జీవిస్తున్నారు. ప్రస్తుతం ఒకే గుడిసెలో రెండు మూడు కుటుంబాల వారు ఉంటున్నారు. వర్షాకాలంలో వారి పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది. వర్షానికి గుడిసెలు దెబ్బతింటున్నాయి. ఆ సమయంలో మాత్రం ప్రభుత్వం రూ.వెయ్యి, రూ.2వేలు, పూర్తిగా ఇల్లు కోల్పోతే రూ.6వేలు మాత్రం ఇచ్చి చేతులు దులిపేసుకుంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఆవు చోరీ.. ఆపై చంపి మాంసం రవాణా

ఆటో స్వాధీనం, నలుగురిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న ఆటోతో కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్

వెదురుకుప్పం, అక్టోబరు 20: ఆవును దొంగిలించి, ఆపై దాన్ని వధించి, ఆ మాంసాన్ని రవాణా చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ దిగువ గెరిగిడొన గ్రామానికి చెందిన బి.హరిబాబు కార్వేటినగరం మండలం కార్వేటినగరం రిజర్వు ఫారెస్టులో పశువులను మేతకు వదిలి పెట్టారు. వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం కాలనీకి చెందిన పోతిపోగు సూర్య, పట్లూరి తరుణ్, ఎగువ గూళూరుకు చెందిన లవకుమార్, హేమాద్రి కలసి హరిబాబుకు చెందిన ఆవును దొంగిలించి, ఆపై వధించి, దాని విడిభాగాలను ఒక ఆటోలో తరలిస్తుండగా.. ఆవులను వెతుకుతూ వెళ్లిన హరిబాబును, చుట్టుపక్కల వారిని చూసి ఆ వ్యక్తులు పారిపోయారు. ఈ విషయమై హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆటో స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఆవులను దొంగిలించినా, పశువులను వధించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

క్రీడలతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి జూడో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జూడో రాష్ట్ర పరిశీలకులు ప్రతాప్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నాయకులు జగన్నాథంనాయుడు, హెచ్‌ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



పదవమైలు దగ్గర, కాటూరు బ్రిడ్జి దగ్గర ఉన్న ప్రమాదకర మలుపులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డులోని మలుపు దగ్గర సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. కేటీ రోడ్డులోని తంగెళ్లపాళెం, పార్లపల్లి, పల్లమాలకండ్రిగ, కాటూరు బ్రిడ్జి, కాటూరు, అరిగిలకండ్రిగ, పదవమైలు, తానగల్లు, కంచనపుత్తూరు, నెరిణికండ్రిగ, కారణిమిట్ట, నెలవాయి, కల్లివెట్టు తదితర గ్రామాల దగ్గర మలుపు ఉన్నాయి. ఈ మలుపు దగ్గర ఎటువంటి హెచ్చరిక బోర్డులు కాని సూచిక బోర్డులు ఏర్పాటు చేయని కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదు. దీనివల్ల పలు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. తానగల్లు, కాటూరు బ్రిడ్జి, కల్లివెట్టు మలుపు దగ్గర జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతిచెందారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కేటీ రోడ్డులోని మలుపు వద్ద హెచ్చరిక బోర్డులతో పాటుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆరో అంతస్తు నుంచి పడి కూలీ మృతి



మణికంఠ మృతదేహం

ఏర్పేడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌పై పనులు చేస్తూ కిందపడి కూలీ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. ఏర్పేడు హెడ్ కానిస్టేబుల్ రమణ కథనం మేరకు.. ఐఐటీ ఎదురుగా హర్షవర్ధన్‌రెడ్డి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నాడు. గుంటూరు జిల్లా వినుకొండ మండలం ముమ్మడివరానికి చెందిన గాలి మణికంఠ(29) ఐదేళ్ల క్రితం తిరుపతికి వచ్చేశాడు. తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతూరువద్ద నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో హర్షవర్ధన్‌రెడ్డి ఇంటిపనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో 6వ అంతస్తులో సెంట్రింగ్ పనిచేస్తూ ప్రమాద వశాత్తూ కింద పడిపోయాడు. వెంటనే అతడిని ఇంటి యజమానికి తిరుపతి రుయాకు తరలించారు. అప్పటికే అతడు మరణించాడు. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీస్టేడియానికి మహర్దశ



విలువిద్య క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవినాయుడు

శ్రీకాళహస్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని మినీస్టేడియానికి మహర్దశ తీసుకొస్తామని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. పట్టణంలో స్పోర్ట్స్ అథారిటీస్ ఆధ్వర్యంలో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మినీస్టేడియం ఏర్పాటు చేశారు. వైసీపీ పాలకులు స్టేడియాన్ని పట్టించుకోలేదు. దీంతో అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం శాప్‌చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సంయుక్తంగా మినీస్టేడియాన్ని పరిశీలించారు. భవనం, పరిసరాలు అధ్వానంగా ఉన్నట్లు గుర్తించారు. యుద్ధప్రాతిపదికన అక్కడ పేరుకుపోయిన మద్యం సీసాలు, సిగరెట్ ముక్కలు, వ్యర్థాలను శుభ్రం చేయించారు. స్టేడియంలోని పరికరాల వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిందన్నారు. చాలాచోట్ల మినీ స్టేడియాలు నిరుపయోగంగా మారాయన్నారు. శ్రీకాళహస్తి మినీస్టేడియాన్ని త్వరలోనే అధునాతనంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమిపూజ

ఏర్పేడు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మాధవమాలలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు, అధికారులు ఆదివారం సాయంత్రం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురవారెడ్డి, పొన్నారావు, చంద్రారెడ్డి, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు
వైద్యం..నైవేద్యం

● పుత్తూరు ఆస్పత్రిలో వైద్యుల కొరత
● పట్టించుకోని పాలకులు, అధికారులు



పుత్తూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం నైవేద్యంలా అందుతోంది. వైద్యులు లేకపోవడంతో సరైన వైద్యం అందక రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. తమ జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు.

ముగ్గురే వైద్యులు

1983లో అప్పటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. ఎనిమిది మంది వైద్యుల పోస్టులను మంజూరు చేశారు. అయితే నేడు ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో ఒకరు రాత్రి విధుల్లో ఉంటే మరుసటి రోజు విశ్రాంతి తీసుకోవడంతో ఇద్దరు మాత్రమే దాదాపు 800 మంది పేషెంట్లకు సేవలు అందించాల్సి వస్తోంది. మధ్యలో ప్రమాద బాధితుల కేసులు వస్తే అవుట్‌పేషెంట్ల పరీక్షలను ఆపేసి అటు వైపు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇక ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి శవ పరీక్షల కోసం మృతదేహాలు వస్తుంటాయి. దీంతో ఓ డాక్టరు ఆ విధుల కోసం అక్కడికి పరుగులు తీయాల్సి ఉంది. శస్త్ర చికిత్సలు చేసే సర్జన్ ఉన్నా మత్తు మందు ఇచ్చే డాక్టరు లేరు. అందువల్ల వారానికి రెండు రోజులు ఇతర ఆస్పత్రుల నుంచి వచ్చే అనస్తీషియన్ కోసం రోగులు, వైద్యులు వేచి చూడాల్సి వస్తోంది. ఫలితంగా శస్త్ర చికిత్సల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇక ప్రసూతి శస్త్ర చికిత్సలు చేస్తున్నా నవజాత శిశువులకు (పురిటి బిడ్డలను) వైద్యం చేసేందుకు చిన్న పిల్లల వైద్యులు లేరు.

పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు

నెలకు దాదాపు 12 వేలమంది అవుట్ పేషంట్లు, 1400 మంది ఇన్‌పేషంట్లు వస్తుంటారు. వైద్యులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అత్యవసర కేసులు వస్తే ప్రాథమిక చికిత్సలు చేసి పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారు. ఫలితంగా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి పేద రోగులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

కలగా మిగిలిన వంద పడకల ఆస్పత్రి

30 పడకల ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచుతున్నామని కొన్నేళ్లుగా పాలకులు అదిగో ఇదిగో అంటున్నా వాస్తవరూపంలోకి రావడం లేదు. ఈ ఆస్పత్రి కంటే వెనుక ఏర్పాటైన నగరి ఆస్పత్రి వందపడకలకు, కార్వేటినగరం ఆస్పత్రి 50 పడకల స్థాయికి చేరాయి.



వైద్యుల కోసం నివేదిక పంపాం

రోగుల తాకిడి ఎక్కువగా వుంది. మందులు, యంత్రాలు, వసతులు ఉన్నాయి. వైద్యులు లేరు. ఉన్నవారితో సర్దుబాటు చేసుకుని పనిచేస్తున్నాం. వైద్యుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.

- వైద్యాధికారి డాక్టర్ కృష్ణకాంత్